జాతీయ పోటీలకు ఎంపిక



గోల్డ్ మెడల్‌తో అజిత్‌రెడ్డి

కమలాపురం : కమలాపురం మండలం టి.చదిపిరాళ్లకు చెందిన చాగారి అజిత్‌రెడ్డి ఫెన్సింగ్ క్రీడలో జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. జూన్ 29వ తేదీన విజయవాడలో నిర్వహించిన అండర్‌-12 స్టేట్ ఛాంపియన్‌షిప్‌లో అత్యంత ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించాడు. అలాగే ఈ నెల 5వ తేదీన మహారాష్ట్రలోని నాసిక్‌లో జరగనున్న నేషనల్ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించాడు. కాగా అజిత్‌రెడ్డి తల్లిదండ్రులు చాగారి చంద్ర ఓబుళ రెడ్డి, ఆశాజ్యోతిలు ఇద్దరూ ప్రభుత్వ పాఠశాలల్లో ఫిజికల్ డైరెక్టర్లుగా పని చేస్తున్నారు. కాగా అజిత్‌రెడ్డి చాగలమర్రిలోని సెయింట్ ఆన్స్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. నేషనల్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక కావడంతో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, సహచరులు అజిత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉద్యోగ విరమణ తప్పనిసరి



ప్రభాకర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న పీబీసీ డీఈలు, సిబ్బంది

పులివెందుల రూరల్ : ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని జీఎన్‌ఎస్‌ఎస్ రిటైర్డ్ ఎస్‌ఈ మధుసూదన్‌రెడ్డి, టీజీపీ రాము నాయక్, డీఈ చంద్రసురేష్‌రెడ్డిలు పేర్కొన్నారు. గత 20 ఏళ్లుగా పీబీసీ కార్యాలయంలో అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్న ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఉద్యోగ విరమణ పొందడంతో స్థానిక పీబీసీ కార్యాలయంలో ఆయనకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీబీసీ కార్యాలయంలో ప్రభాకర్‌రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. అందరితో కలిసి మెలిసి ఉండి ఆప్యాయంగా పలకరిస్తూ మంచి పేరు తెచ్చుకున్నారని అన్నారు. అనంతరం ప్రభాకర్‌రెడ్డి దంపతులకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్‌ఈ సూర్యనారాయణ, డీఈలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక పీర్ల పండుగ



పెద్దజూటూరులో పీర్ల చావిడిని ప్రారంభిస్తున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి
- రూ.20 లక్షలతో నిర్మించిన పీర్ల చావిడి ప్రారంభం

వేముల : గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో జరుపుకొనే పీర్ల పండుగ మత సామరస్యానికి ప్రతీక అని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పెద్దజూటూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ వెంకట బయపురెడ్డి, మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ మరకా శివకృష్ణారెడ్డిలతో కలిసి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పర్యటించారు. గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన పీర్ల చావిడిని ఎంపీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనాది నుంచి గ్రామాల్లో పీర్ల పండుగను ఘనంగా జరుపుకొనే వారన్నారు. ఈ పండుగను ఆచారాలు, సంప్రదాయాలతో గ్రామస్తులు కలిసికట్టుగా జరుపుకోవడం అభినందనీయమన్నారు. అన్ని మతాల వారు కలిసి జరుపుకోవడం ద్వారా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంటోందన్నారు. బంధువులు, స్నేహితులతో కలిసి జరుపుకోవడం ద్వారా పీర్ల పండుగకు ఎంత ప్రాధాన్యత ఉందో అర్థమవుతోందన్నారు. అంతకుముందు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి గ్రామం సరిహద్దుకు రాగానే గ్రామస్తులు బ్యాండు మేళాలతో ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి పీర్లతో కలిసి ఆయన గ్రామానికి చేరుకుని పీర్ల చావిడిని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లా వెంకటనారాయణ, రామచంద్రారెడ్డి, హేమాద్రిరెడ్డి, వెంకటరామిరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, రోశన్న, రామకృష్ణారెడ్డి, న్యాయవాది నరసింహారెడ్డిలతోపాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలుకు ఉత్తర్వులు జారీ చేయాలి



మాట్లాడుతున్న ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ

పులివెందుల టౌన్ : మాదిగ ఉప కులాల విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ఈ ఏడాది ఎస్సీ వర్గీకరణ అమలుకు ఉత్తర్వులు జారీ చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం పట్టణంలోని స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని మెడిసిన్, ఇంజినీరింగ్, పీజీ అడ్మిషన్లలో రెండు దశాబ్దాల కాలంగా వర్గీకరణ జరగలేదని, ఈ ఏడాదైనా అమలైతే తమ పిల్లల జీవితాలు బాగుపడతాయన్నారు. ప్రభుత్వం మాదిగ ఉప కులాల విద్యార్థులకు ప్రమాద బీమా, ఆరోగ్య భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో గురుకుల విద్యాలయాలలో చదువుతున్న పిల్లలు వివిధ రోడ్డు ప్రమాదాలలో ఎంతో మంది మృత్యువాత పడుతున్నారని, అలాంటి విద్యార్థుల పట్ల ప్రభుత్వం అప్రమత్తమై ప్రమాద బీమా పాలసీని ప్రవేశపెట్టాలన్నారు. అదేవిధంగా దళిత గిరిజనులకు వివిధ రకాల ప్రభుత్వ భూములను ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా వర్తింపజేయాలన్నారు. సాగులో లేని భూములను అభివృద్ధి చేసుకునేందుకు మాదిగ, మాల కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో డప్పు చర్మకారుల రాష్ట్ర కన్వీనర్ కె.నాగభూషణం, మాదిగ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.కృష్ణమూర్తి, మాదిగ, ఎంఈఎస్ గిరీశ్వర వర్మ మాదిగ, సింహాద్రిపురం మండలం కన్వీనర్ అరవింద మాదిగ, సుబ్బయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సాయం



సబ్‌జైలులో రికార్డులు పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్

కమలాపురం : పలు కేసుల్లో జైళ్లలో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారు ఉచిత న్యాయ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ బాబా ఫకృద్దీన్ తెలిపారు. సోమవారం ఆయన కమలాపురం సబ్ జైలులోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను విజిట్ చేశారు. రిజిష్టర్లను పరిశీలించారు. రిమాండ్‌లో ఉన్న ఖైదీలతో మాట్లాడారు. ఏ కేసులో జైలుకు వచ్చారు.. తదితర వివరాలపై ఆరా తీశారు. లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను ఖైదీలకు వివరించారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఖైదీల ఆరోగ్యం పై సబ్ జైలు సూపరింటెండెంట్ గంగాధర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారు ఉచిత న్యాయ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. న్యాయ సహాయం పొందే విధానం గురించి వివరించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100కు ఫోన్ చేసి న్యాయ సహాయం పొందవచ్చన్నారు. ఖైదీలకు సమస్యలుంటే మండల న్యాయ సమితిని సంప్రదించాలన్నారు. లేని పక్షంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప ను సంప్రదించి, తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన ఖైదీలకు సూచించారు. కార్యక్రమంలో సబ్‌జైలు సిబ్బంది, న్యాయవాదులు, పారాలీగల్ వలంటరీలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలి



అంబేడ్కర్, గాంధీజీ చిత్రపటాల వద్ద నివాళులు అర్పిస్తున్న అధికారులు, మహిళా సర్పంచ్‌లు

పులివెందుల రూరల్ : గ్రామాల అభివృద్ధిపై మహిళా సర్పంచ్‌లు ప్రత్యేక దృష్టి సారించాలని ట్రైనర్ నాగభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీడీఓ కృష్ణమూర్తి అధ్యక్షతన మహిళా సర్పంచ్‌లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, మహిళా సర్పంచ్‌లు జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ట్రైనర్ నాగభూషణ్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ మహిళా నాయకత్వంలో మార్పు, సుపరిపాలన, సాధికారత, మైక్రో ల్యాబ్ యాక్టివిటీ, లింగత్వంపై అవగాహన కల్పించారు. లింగ ఆధారిత పనులు 73వ విభజన రాజ్యాంగ సవరణ స్థానిక పాలనలో మహిళలకు ఏ అవకాశాలు ఉన్నాయో వాటిపై వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమం మూడు రోజుల పాటు ఉంటుంది. కార్యక్రమంలో ట్రైనర్ బి.వి.నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా సెల్ టవర్



తాతిరెడ్డిపల్లె గ్రామంలోని సెల్ టవర్

లింగాల : మండలంలోని తాతిరెడ్డిపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన సెల్ టవర్ అలంకార ప్రాయంగా దర్శనమిస్తోంది. జియో టవర్ ఏర్పాటు చేసినప్పటికీ సిగ్నల్స్ అందడం లేదని ఏపీ ఫైబర్ నెట్ కనెక్షన్ ఎప్పుడు పని చేస్తుందో, పని చేయదో తెలియని పరిస్థితి నెలకొందని వినియోగదారులు వాపోతున్నారు. గ్రామంలో సుమారు 400 నివాస గృహాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్ వినియోగించడం వల్ల ఒక్కొక్కరు ప్రతి నెలా రూ.300లు రీచార్జి చేసుకుంటున్నారని, దీనివల్ల వేలాది రూపాయలు నష్టపోతున్నామని వారు వాపోతున్నారు. మొబైల్ సిగ్నల్స్ కోసం కొండలు, గుట్టలు ఎక్కి నెట్ చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సెల్ టవర్ ఏర్పాటు చేసినప్పటి నుంచి సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో వేలాది రూపాయలు బూడిదలో పోసిన పన్నీరులా అవుతుందని వినియోగదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సెల్ సిగ్నల్స్, నెట్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

నియామకం

పులివెందుల రూరల్ : పులివెందుల ఇన్‌చార్జి సీడీపీఓగా వేంపల్లెలో పని చేస్తున్న సీడీపీఓ సునీతను నియమించారు. సోమవారం ఐసీడీఎస్ కార్యాలయంలో ఇన్‌చార్జి సీడీపీఓగా సునీత బాధ్యతలు చేపట్టారు. పులివెందుల సీడీపీఓగా పని చేస్తున్న శ్రీలత బదిలీపై కమలాపురానికి వెళ్లారు. ఆమె స్థానంలో సునీతను నియమించారు.

జ్వరాలతో వణుకుతున్న ఓబుళనాయునిపల్లె

చక్రాయపేట : మండల తహసీల్దారు కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ఓబుళనాయునిపల్లె వాసులు జ్వరాలతో వణికి పోతున్నారు. ఇంటిల్లిపాది జ్వరాల బారిన పడటంతో.. వంట చేసే దిక్కు కూడా లేక అల్లాడుతున్నారు. ప్రతి ఒక్కరూ కీళ్ల నొప్పులు, వళ్లు నొప్పులతో అవస్థలు పడుతూ కడప, రాయచోటి, వేంపల్లె, పులివెందులకు వెళ్లి చికిత్సలు పొందుతున్నారు. వేలకు వేలు డబ్బు ఖర్చవుతున్నా తమకు నయం కావడం లేదని వాపోతున్నారు. జ్వరాలతో ఇంతటి ఇబ్బందులు ఎప్పుడూ పడలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరకు పురిటి బిడ్డలను సైతం జ్వరాలు వదలలేదని వాపోతున్నారు. గ్రామంలో దోమల బెడద ఎక్కువగా ఉండటమే జ్వరాలకు కారణంగా కనిపిస్తోంది. వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటించి వైద్యసేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి సాయం

కమలాపురం : కమలాపురం నగర పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్న పెంచలయ్య (37) గుండె పోటుతో మృతి చెందాడు. ఆదివారం అర్ధరాత్రి గుండెలో నొప్పి ఉందని చెప్పడంతో కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేశారు. పరిస్థితి విషమంగా ఉందని, కడపకు తీసుకెళ్లాలని వైద్య సిబ్బంది సూచించారు. అయితే అప్పుడే క్షణాల్లో పెంచలయ్య తుదిశ్వాస విడిచాడు. కాగా విషయం తెలుసుకున్న మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ బాల నరసింహులు, చైర్ పర్సన్ మేరీ మస్తాన్, సిబ్బంది సోమవారం ఉదయం మృతుడి నివాసానికి చేరుకుని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ సిబ్బంది కలసి మట్టి ఖర్చులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. మృతునికి భార్య, చిన్న వయస్సు గల కుమార్తె, కుమారుడు ఉన్నారు. గత 17 ఏళ్లుగా పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్న పెంచలయ్య కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని పలువురు ప్రజా ప్రతినిధులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కనిపించే దేవుడు వైద్యుడు



- నేడు వైద్యుల దినోత్సవం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆరోగ్యమే మహాభాగ్యమంటారు. మనిషికి ఎంత సంపద ఉన్నా దాన్ని అనుభవించే ఆరోగ్యం లేకపోతే అదంతా వృథాయే. అనారోగ్యంతో బాధపడే వారిని ప్రమాద స్థితి నుంచి కాపాడే శక్తి కేవలం వైద్యుడికే ఉంది. సమాజంలో అత్యంత పవిత్రమైన, కీలకమైన వృత్తి వైద్యం. సాక్షాత్తు దేవుడులాంటివాడివంటూ హృదయ పూర్వకంగా నమస్కారం చేస్తారు. అందుకే ఆయనను 'వైద్యో నారాయణో హరి' అంటూ గౌరవిస్తారు. భారతరత్న డాక్టర్ బీసీ రాయ్ వైద్య రంగం అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన వైద్య కల్పనకు విశేషమైన కృషి చేశారు. ఆయన సంస్మరణార్థం ప్రతి ఏటా ప్రభుత్వం జూలై 1వ తేదీన నేషనల్ డాక్టర్స్ డేను నిర్వహిస్తున్నారు. వైద్యులు ఆ మహనీయుడి స్ఫూర్తితో వైద్య రంగంలో రాణిస్తున్నారు. వైద్యులకు సంబంధించి వైఎస్సార్ కడప జిల్లాలో కొన్ని విశేషాలు ఉన్నాయి. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కడప నగరంలో ఒక వీధి వీధే డాక్టర్లతో నిండి ఉంది. దాదాపు వంద మీటర్ల పొడవునా ఇరువైపులా ఆ వీధంతా డాక్టర్లు, వైద్యశాలలు, ల్యాబొరేటరీలు, మందుల దుకాణాలు ఉన్నాయి. దాన్ని క్రిస్టియన్ లేన్‌గా వ్యవహరిస్తున్నా నిజానికి దాన్ని డాక్టర్స్ వీధి అనాల్సి ఉంది. రేయింబవళ్లు ఈ వీధిలో రోగులను తరలించే అంబులెన్స్‌లు కనిపిస్తూనే ఉంటాయి. అలాగే జిల్లాలో ఎందరో ప్రముఖ వైద్య నిపుణులు ఉన్నారు. రోగులకు విశేష సేవలు అందిస్తున్న వైద్యులకు వైద్యుల దినోత్సవ సందర్భంగా పలువురు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.